సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 16 | సెప్టెంబర్ | 2023



సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీఓ అంకిత్ ఆదేశించారు.

- IIలో ▸



పట్టాభిషేకానికి వేళాయె..

నిట్ వరంగల్ 21వ స్నాతకోత్సవం సందర్భంగా 2,029 మంది విద్యార్థులు పట్టాలను అందుకోనున్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
31.0°/25.0°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్లకు నాలుగవ విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని 23వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో విద్యార్హత ధృవీకరణ పత్రాలను కళాశాలలో అందజేయాలని సూచించారు.

శిక్షణ పొందిన అభ్యర్థులకు పరీక్ష



భూపాలపల్లి అర్బన్: వృత్తి విద్య కోర్సులలో శిక్షణ పొందిన అభ్యర్థులకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జ్ సేవా అధ్యక్షురాలు బండి వనజ వెంకటయ్య హాజరై అభ్యర్థులకు ప్రశ్నపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సేవాసమితి కోఆర్డినేటర్ శివకుమార్, జీఎం సీఎస్‌డీ నరేష్, అధికార ప్రతినిధి తుకారాం, లేడీస్‌క్లబ్ కార్యదర్శి రమణివెంకటరామిరెడ్డి, అధికారులు రాజశేఖర్, శ్యామ్‌ప్రసాద్, సేవా కోఆర్డినేటర్ ప్రవీణ్, కార్యదర్శి లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ



భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించాలన్నారు. చెరువులను కలుషితం కాకుండా కాపాడాలని ఏరియా అధికార ప్రతినిధి తుకారాం తెలిపారు.

అటవీ గ్రామాలు, తండాల్లో వైద్యశిబిరాలు



మహాముత్తారం: మహాముత్తారం మండలకేంద్రంతో పాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో శుక్రవారం మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'ఏజెన్సీకి ఫీవర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. ప్రేమ్‌నగర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. పోలారం, మహాముత్తారం, సింగారం గ్రామ పంచాయతీల్లో వైద్య శిబిరాలు నిర్వహించి 156మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఉమా, వెంకటేష్, జ్యోతి, ఏఎన్‌ఎంలు జ్ఞానేశ్వరి, శారద, సంధ్యారాణి, సరోజన, భారతీ, ఆశవర్కర్లు ఉన్నారు.

మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



భూపాలపల్లి రూరల్: అఖిల భారత మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో చట్టసభల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు గుర్తుచేశారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పింగిలి జ్యోతి, దండు లక్ష్మి, గూడూరి మమత, బ్లాకు అధ్యక్షురాలు మోతే అరుణ పాల్గొన్నారు.

భద్రత కట్టుదిట్టం!

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు బార్డర్ చెక్‌పోస్టుల ఏర్పాటు

- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసులతో సమన్వయం
- మావోయిస్టుల కట్టడి, నిషేధిత వస్తువుల రవాణాకు అడ్డుకట్ట
- పోలీసు, ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్ అధికారుల విధులు
- కాళేశ్వరం, మేడిగడ్డలో చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు



కాళేశ్వరం బార్డర్ చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

కాళేశ్వరం: తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని అంతర్రాష్ట్ర బార్డర్ చెక్‌పోస్టుల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజీల వద్ద రెండు బార్డర్ చెక్‌పోస్టులను పోలీసులు ఏర్పాటు చేశారు. తెలంగాణలోకి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి తరలివచ్చే నిషేధిత వస్తువులకు ఆదిలోనే చెక్‌పెడుతున్నారు. మావోయిస్టులు, గంజాయి, మత్తుపదార్థాలు, లిక్కర్, డబ్బులు, ఆయుధాల రవాణా, ఇతర నిషేధిత వస్తువులను తీసుకురాకుండా భద్రత చర్యలు కట్టుదిట్టం చేస్తున్నారు. దీంతో నిత్యం వాహన తనిఖీలతో అంతర్రాష్ట్ర వంతెన వద్ద రద్దీ ఏర్పడుతుంది.

విధుల్లో మూడు శాఖల అధికారులు..

అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేందుకు ఇప్పటికే పోలీసుశాఖతో పాటు కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్‌శాఖల అధికారులకు బార్డర్ చెక్‌పోస్టుల్లో విధులు అప్పగించారు. 15రోజులుగా బార్డర్ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, సోదాలను ఈ మూడు శాఖల ఆధ్వర్యంలో ముమ్మరం చేస్తున్నారు. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు, టూవీలర్స్‌ను తనిఖీచేస్తూ వాహన పత్రాలు, రెసిడెన్సియల్ అడ్రస్ వివరాలు తీసుకుంటున్నారు.

మావోయిస్టుల కట్టడికి ప్రణాళికలు!

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల ముందు తమ ఉనికిని చాటుకోవడానికి ఎక్కడో ఓ చోట అవాంఛనీయ ఘటనలు చేపట్టే అవకాశం ఉంది. పోలీసులు వారిని బార్డర్ చెక్‌పోస్టులు దాటనీయకుండా చెక్‌పోస్టుల్లోనే చెక్‌పెట్టడానికి నిఘా తీవ్రం చేశారు. ఇప్పటికే అటవీ ప్రాంతాలతో పాటు సరిహద్దుల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో అనుమానితులను విచారించి మావోయిస్టుల జాడను కనుగొనడానికి ప్రయత్నాలు, కమ్యూనిటీ కాంటాక్టులు పోలీసులు నిర్వహిస్తున్నారు. గిరిజన గ్రామాలపై ప్రత్యేక నజర్ వేసి మావోయిస్టులను తిప్పికొట్టడానికి పకడ్బందీ చర్యలు, ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మహారాష్ట్రలోని సిరొంచ, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా భద్రకాళి ఏఎస్పీ, డీఎస్పీ పోలీసులతో వారం కిందట కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించి మావోయిస్టుల కట్టడికి నివారణ చర్యలు సమన్వయం చేసినట్లు తెలిసింది. అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి ఎన్నికల్లో అవరోధాలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. నాలుగు రోజుల కిందట ఎస్పీ కరుణాకర్ ఆకస్మికంగా కాళేశ్వరం వద్ద తనిఖీల్లో పాల్గొని పోలీసులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి నదుల వెంట కూంబింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఓడరేవులపై ప్రత్యేక నజర్‌వేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు, పంపుహౌస్‌ల వద్ద కూడా బందోబస్తును రాత్రివేళల్లో నిర్వహిస్తూ గస్తీ నిర్వహిస్తున్నారు. అన్ని విషయాలూ తెలిసిపోయేలా కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసి అక్రమ రవాణాతో పాటు మావోయిస్టుల కట్టడితో అప్రమత్తం అవుతున్నారు. దీంతో అక్రమ వ్యాపారాలు చేసేవారికి మింగుడు పడడం లేదు. కలప, ఇసుక, లిక్కర్, గంజాయి, ఇతర నిషేధిత వస్తువుల రవాణా తగ్గుముఖం పట్టినట్లు తెలిసింది.

అక్రమ రవాణాకు చెక్..



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. నిత్యం తనిఖీలు, సోదాలు చేస్తాం. పోలీసు, కమర్షియల్‌టాక్స్, ఎక్సైజ్‌శాఖలు విధులు నిర్వర్తిస్తున్నారు. రాత్రి, పగలు బందోబస్తులో ఉంటారు. గంజాయి, డబ్బులు, మద్యంతో పాటు ఇతర నిషేధిత వస్తువుల తరలింపునకు చెక్‌పెడుతాం.

- జి. రామ్మోహన్‌రెడ్డి, డీఎస్పీ, కాటారం

ప్రశాంతంగా టెట్





జిల్లాకేంద్రంలో టెట్ పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ భవేష్‌మిశ్రా తెలిపారు. ఉదయం పేపర్-1 పరీక్షకు 1,421 అభ్యర్థులు నమోదు చేసుకోసుకోగా 1,156 మంది హాజరు కాగా 265 అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పేపర్-2 పరీక్షకు 1,178 అభ్యర్థులకు 1,107మంది హాజరుకాగా 71మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షకు అన్ని శాఖల సమన్వయంతో పరీక్ష దిగ్విజయంగా పూర్తయినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆకస్మికంగా పరిశీలించారు.



విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

జిల్లా నోడల్ అధికారి దేవరాజం

మల్హర్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి, తాడిచర్ల జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ దేవరాజం అన్నారు. మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. ఇందులో భాగంగా దేవరాజం మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో వసతులు, సౌకర్యాలు వినియోగించుకొని విద్యార్థులు చక్కగా చదువుకోవాలని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. సమయపాలన, కార్యదీక్షత వంటి మంచి లక్షణాలు అలవర్చుకొని పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆశించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, సర్పంచ్ సుంకరి సత్తయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి దేవరాజం

పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్త

సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లి అర్బన్: పరిచయం లేని, గుర్తుతెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి సూచించారు. 'అపహరణకు గురైన బాధితులు, సెక్స్ వ్యాపారానికి బలి అవుతున్న వారు' అనే అంశం మీద శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మార్గదర్శిని హైస్కూల్‌లో జరిగిన ఈ సమావేశానికి జడ్జి జయరాంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. చిన్నపిల్లలు, పెద్దవాళ్లు గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా చిన్న వయస్సులో పిల్లలకు వాహనాలు ఇవ్వడం మంచిదికాదన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. చదువు, డబ్బులు లేకుండా, చట్టాల మీద అవగాహన లేకుండా సమస్యలతో ఎవరైనా ఇబ్బంది పడుతున్నట్టు గమనిస్తే జిల్లా న్యాయసేవాధికార సంస్థకు పంపించాలన్నారు. అలాంటి వారికి న్యాయం చేయడానికి అన్ని వేళలా అందుబాటులో ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ విష్ణువర్ధన్‌రావు, స్కూల్ ప్రిన్సిపాల్ ఫిరోజ్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

స్వరాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు



ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి సత్యవతి, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్లు, అధికారులు,

- వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు
- 57ఏళ్ల ఉమ్మడి పాలనలో 3 వైద్య కళాశాలలు
- 9 ఏళ్ల స్వపరిపాలనలో 21 ఏర్పాటు
- మెడికల్ కళాశాలను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం కేసీఆర్
- హాజరైన మంత్రి సత్యవతిరాథోడ్ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్లు



వర్చువల్‌లో మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్



ర్యాలీలో పాల్గొన్న మంత్రి సత్యవతి, ఎమ్మెల్యే

భూపాలపల్లి అర్బన్: దేశానికే మణిహారంగా తెలంగాణలో ప్రభుత్వ వైద్య విద్యను, వైద్య సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని, వైద్య విద్యలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన నూతన అధ్యాయానికి నాంది పలికామని రాష్ట్ర మహిళా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. వర్చువల్ విధానంలో హైదరాబాద్ నుంచి సీఎం కేసీఆర్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, సీఎస్ శాంతికుమారి, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. జిల్లాకేంద్రంలోని మెడికల్ కళాశాలలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్మన్లు జక్కు శ్రీహర్షిణి, పుట్ట మధు వైద్య కళాశాల నుంచి పాల్గొన్నారు. మెడికల్ కళాశాల పనుల వేగవంతానికి కృషి చేసిన కలెక్టర్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు కృషి ఫలితంగా జిల్లాకు మెడికల్ కళాశాల సాధించామన్నారు. 57 సంవత్సరాల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో తెలంగాణ ప్రాంతంలో కేవలం 3 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవని.. స్వరాష్ట్రంలో 9 సంవత్సరాలలో 21 ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభించుకోవడం సంతోషకరమని అన్నారు. రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలల ఏర్పాటుతో ఇతర దేశాలకు వెళ్లి అభ్యసించాల్సిన దుస్థితి తప్పిందని చెప్పారు. జిల్లాలో వైద్య కళాశాలతో పాటు నర్సింగ్ కళాశాలలు, పారా మెడికల్ కళాశాలల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్య కళాశాలతో పాటు జిల్లాలోని ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. హైదరాబాద్ వరంగల్ వంటి నగరాలలో అందిన వైద్య సేవలు నేడు భూపాల్లిపల్లిలో సైతం ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు సామాజిక భద్రత, పేదలకు, తెలంగాణ ప్రాంత ప్రజలకు గొప్ప సేవలు అందించాలనే ఉద్దేశంతో మెడికల్ విద్యనభ్యసించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. వైద్య కళాశాల నిర్మాణంలో కృషిచేసిన అధికారులకు ఇంజనీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి డాక్టర్లుగా తయారు కావాలని, ప్రజలకు ఉన్నతమైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ భవేష్‌మిశ్రా, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్, భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌దేవుడే, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీ రామ్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కృతజ్ఞతా ర్యాలీ

మెడికల్ కళాశాలను సీఎం కేసీఆర్ వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆధ్వర్యంలో హన్మాన్ దేవాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు హింగే మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్.. మజ్లిస్ ఆత్మలే

- తెలంగాణ చరిత్రను అణచివేస్తున్న కేసీఆర్ సర్కార్
- బీజేపీ అధికారంలోకి రాగానే.. ఘనంగా విమోచన దినోత్సవం
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి
- హైదరాబాద్ నుంచి పరకాల వరకు బైక్ ర్యాలీ
- అమరధామం వద్ద అమరవీరులకు నివాళి.. బహిరంగ సభ



బహిరంగ సభలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి



సభకు హాజరైన జనం



వరంగల్ నగరంలో కొనసాగుతున్న బైక్‌ర్యాలీ

పరకాల: భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే.. తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం 13 నెలల భీకర పోరాటం.. వేలాది మంది బలిదానాలతో వచ్చిందని, ఈ వాస్తవాలను నిజాం వారసుడు ఖాసీం రజ్వీకి చెందిన మజ్లిస్ పార్టీ కోసం నాడు కాంగ్రెస్.. నేడు కేసీఆర్ సర్కార్ వక్రీకరిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలు.. మజ్లిస్ ఆత్మలేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ సమైక్యతా దినోత్సవం పేరిట కేసీఆర్ సర్కారు తెలంగాణకు ఉన్న చరిత్ర కనుమరుగు చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే.. వచ్చే ఏడాది సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ నుంచి బైక్ ర్యాలీగా పరకాల అమరధామం చేరుకున్నారు. తెలంగాణ అమర వీరులకు నివాళులు అర్పించారు. పరకాల పశువుల సంతలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా కిషన్‌రెడ్డి, పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భుక్తి కోసం.. స్వేచ్ఛా వాయువుల కోసం తుపాకులకు గుండెలను ఎదురుపెట్టి వేలాది మంది బలిదానాలతో 75 సంవత్సరాల తెలంగాణ విమోచన చరిత్రను దాచిపెట్టిన మొదటి ముద్దాయి కాంగ్రెస్ అన్నారు.కేసీఆర్ చదివిన 80 వేల పుస్తకాల్లో నాటి తెలంగాణ చరిత్ర గురించి లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేస్తే సోనియాగాంధీ కుటుంబం కోసమన్న ఆయన బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే కేసీఆర్ కుటుంబం కోసమేనన్నారు. అదే బీజేపీకి ఓటు వేస్తే ప్రజల కోసం పార్టీ పని చేస్తుందన్నారు.

ఆత్మగౌరవం ఉన్నోళ్లు బీఆర్‌ఎస్‌కు ఓటు వేయరు: ఈటల

బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆత్మగౌరవం ఉన్నవాళ్లు ఎవరూ బీఆర్‌ఎస్‌కు ఓటు వేయరని అన్నారు. కులమతాలకతీతంగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కేసీఆర్ కుటుంబాన్ని మహాభారతంలో ధర్మరాజు సిద్ధాంతంతో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమరధామం వద్ద స్వాతంత్ర్య సమరయోధులను, సాయుధ పోరాటంలో అసువులు బాసిన వారి వారసులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చాడ సురేశ్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే గుండె విజయరామారావు, మార్తినేని ధర్మారావు, మొలుగూరి భిక్షపతి, జయపాల్, కొండేటి శ్రీధర్, చింతల రామచంద్రారెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ప్రబారీ మురళీధర్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్, రాష్ట్ర నాయకులు డాక్టర్ కాళీప్రసాద్‌రావు, దేవు సాంబయ్య, కాచం గురుప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఏనుగు రాకేశ్‌రెడ్డి, గుజ్జుల సత్యనారాయణరావు, కాచం గురుప్రసాద్, మార్త భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భర్త చేతిలో భార్య హత్య

● మద్యం మత్తులో ఘాతుకం


రంగమ్మ (ఫైల్)

దంతాలపల్లి: కట్టుకున్న భార్యను దారుణంగా హత్య చేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన తండ సత్తయ్య, రంగమ్మ(65) దంపతులకు ముగ్గురు కుమారులు. కొన్ని సంవత్సరాల క్రితం ఒక కుమారుడు మృతి చెందగా మరో ఇద్దరు బతుకుదెరువుకోసం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈక్రమంలో తండ సత్తయ్యకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఏడు సంవత్సరాలుగా వైద్యం అందించారు. మాములు స్థితికి చేరిన సత్తయ్య తాగుడుకు బానిస అయ్యాడు. గురువారం సత్తయ్య మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య రంగమ్మతో గొడవకు దిగి ఇంట్లో ఉన్న సుత్తితో మెడపై మోదీ హతమార్చాడు. ఎవరికి అనుమానం రాకుండా దుప్పట్లో చుట్టి మంచం పక్కన ఉంచాడు. ఉదయం ఎంతసేపటికీ రంగమ్మ లేవకపోవడంతో చుట్టుపక్కలవారు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి రంగమ్మ విఘతజీవిగా పడి ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది తొర్రూర్ డీఎస్పీ వెంకటేష్‌బాబుకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని రంగమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైన్స్‌పై టాస్క్ ఫోర్స్ దాడులు


బీర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వరంగల్ క్రైం : వైన్స్‌లో కాలం చెల్లిన బీర్లు అమ్ముతున్నారనే సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించి, రూ.2 లక్షల విలువ గల కాలం చెల్లిన బీర్లను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కాలం చెల్లిన బీర్లను సదరు కంపెనీలకు వాపస్ చేయకుండా, ధ్వంసం చేయకుండా యథేచ్ఛగా అమ్ముతున్న ట్రై సిటీస్‌లోని పార్క్ లైన్ వైన్ షాప్‌లపై దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సుబేదారి, కేయూ క్రాస్, వరంగల్ గోపాలస్వామి గుడి దగ్గర గల పార్క్‌లైన్ వైన్స్‌పై దాడులు నిర్వహించి కాలం చెల్లిన బీర్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

పట్టాభిషేకానికి వేళాయె

నేడు నిట్ 21వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న నీతి ఆయోగ్ సభ్యుడు విజయ్‌కుమార్ సరస్వత్
- పట్టాలందుకోనున్న 2,029 మంది విద్యార్థులు


మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుడీ

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ 21వ స్నాతకోత్సవ మహోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ బిద్యాధర్ సుబుడీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లోని హోమిబా కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 21వ స్నాతకోత్సవంలో నిట్‌లో విద్యనభ్యసించిన 2,029 మంది విద్యార్థులు ఇందులో పీహెచ్‌డీ 126, ఎంటెక్ 603, పీజీ డిప్లొమా 7, ఎమ్మెస్సీ 154, ఎంబీఏ 23, 52 ఎంసీఏ, బీటెక్ 1064 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకోనున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించే 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ మెంబర్, డీఆర్‌డీఓ సెక్రటరీ, పద్మభూషణ్ డాక్టర్ విజయ్‌కుమార్ సరస్వత్ పాల్గొననున్నట్లు తెలిపారు. 21వ స్నాతకోత్సవంలో 8 మంది విద్యార్థులు వివిధ డిపార్ట్‌మెంట్లలో గోల్డ్ మెడల్‌ను అందుకోనుండగా, డిపార్ట్‌మెంట్, ఇనిస్టిట్యూట్ గోల్డ్ మెడల్ విన్నర్‌గా నివేదిత ఉల్లంఘనాథ్ అందుకోనున్నట్లు తెలిపారు.

సివిల్స్ నా లక్ష్యం



మా నాన్న శేఖర్‌రెడ్డి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన స్ఫూర్తితో సేవలందించేందుకు సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో హైదరాబాద్‌లోని సెల్స్ ఫోర్స్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.43 లక్షల ప్యాకేజీతో పని చేస్తున్నాను. సీఎస్‌ఈ విభాగంలో 9.42 సీజీపీఏ సాధించి గోల్డ్ మెడల్ విన్నర్‌గా నిలవడం ఆనందంగా ఉంది.

– సుధీరెడ్డి దినేష్‌రెడ్డి, సీఎస్‌ఈ

టీచింగ్ అంటే చాలా ఇష్టం



మాది బెంగళూరు. మా నాన్న ఉల్లంఘనాథ్, తల్లి గోమతి. నాన్న కెమికల్ ఇంజనీర్‌గా కొనసాగుతున్నారు. నిట్ వరంగల్‌లో బీటెక్ బయోటెక్నాలజీ విభాగంలో పూర్తి చేశాను. ప్రస్తుతం బెంగళూరులోని ఐఐసీ కళాశాలలో ఎంటెక్ చేస్తున్నాను. నాకు టీచింగ్ చాలా ఇష్టం. విదేశాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసి హ్యూమన్ మైక్రో బయోలజీపై పరిశోధనలను చేసి మందులు, యోగా లాంటి వ్యాయామాలు లేకుండా ఆరోగ్యవంతమైన జీవనానికి పరిశోధనలు చేస్తా. నిట్‌లో బయోటెక్నాలజీ విభాగంలో 9.75 సీజీపీఏ సాధించి ఇనిస్టిట్యూట్, డిపార్ట్‌మెంట్ గోల్డ్ విన్నర్‌గా నిలవడం ఆనందంగా ఉంది.

– నివేదిత ఉల్లంఘనాథ్, బయోటెక్నాలజీ, ఇన్‌స్టిట్యూట్, డిపార్ట్‌మెంట్ గోల్డ్‌మెడల్ విన్నర్

మెటీరియల్ సైంటిస్ట్ నా లక్ష్యం



మెటీరియల్స్ సైంటిస్ట్‌గా రాణించడమే నా లక్ష్యం. మాది విశాఖపట్నం మా నాన్న చంద్రశేఖర్ యూఎస్‌లో క్రూషిప్పింగ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. మా అమ్మ షర్మిల మ్యాథ్స్ టీచర్. నేను నిట్ వరంగల్‌లో మెటలర్జీ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసాను. 9.21 సీజీపీఏ సాధించి గోల్డ్‌మెడల్ సాధించడం ఆనందంగా ఉంది. క్యాంపస్ సెలక్షన్స్‌లో రూ.14లక్షల ప్యాకేజీకి వెస్ట్‌బెంగాల్‌లోని వేదాంత్ కంపెనీలో సెలక్ట్ అయ్యాకా కూడా రీసెర్చ్‌పై ఆసక్తితో ఐఐఎస్‌ఈ బెంగళూరులో రీసెర్చ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాను.

– తరుణ్ మారెట్ల, మెటలర్జీ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ గోల్డ్‌మెడల్ విన్నర్

ఎంటర్ ప్రెన్యూర్‌గా రాణించడం లక్ష్యం



నేను స్వయంగా కంపెనీని ప్రారంభించి ఎంటర్ ప్రెన్యూర్‌గా తోటి మిత్రులకు ఉపాధి అవకాశాలను కల్పించడమే నా లక్ష్యం. మా నాన్న కిషోర్‌కుమార్ లైబ్రేరియన్‌గా, మా తల్లి జ్యోతి టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నేను ప్రస్తుతం ఢిల్లీలోని స్ప్రింకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి రూ.15 లక్షల ప్యాకేజీకి మేనేజింగ్ కన్సల్టెంట్‌గా క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికయ్యాను. నిట్ మెకానికల్ విభాగంలో 9.48 సీజీపీఏ సాధించి గోల్డ్‌మెడల్ సాధించడం ఆనందంగా ఉంది.

– రేవంత్ చిన్ని, మెకానికల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జూమ్ మీటింగ్‌లో ఐటీడీఏ పీఓ అంకిత్


జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: సీజనల్ వ్యాధులకపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో బ్లీచింగ్, దోమల నివారణ మందు చేయించాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఐటీడీఏ పీఓ అంకిత్ జూమ్ మీటింగ్‌లో ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి జూమ్ మీటింగ్‌లో ఉమ్మడి జిల్లాలోని డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారులు, అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్లు, హెడ్ మాస్టర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో హెల్త్ – పారిశుద్ధ్య ఏర్పాట్లు, గిరిజన సంక్షేమంలో ఆహార భద్రత చర్యలపై జూమ్ మీటింగ్ సూచనలను జారీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, విద్యాసంస్థల్లోని హెచ్‌డబ్ల్యూఓలు, హెచ్‌ఎంలు రోజు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మానిటరింగ్ చేసి రిపోర్ట్ ఇవ్వాలన్నారు. బియ్యం వండడానికి ముందు, నాణ్యతను తనిఖీ చేయాలని, నాణ్యత తక్కువగా ఉంటే పౌర సరఫరాల శాఖ, డీడీని సంప్రదించాలన్నారు. అన్ని గిరిజన సంక్షేమ సంస్థల్లో విద్యార్థులతో మెస్ కమిటీని ఏర్పాటు చేశారా.. లేదా.. అని ఆరా తీశారు. ఆరోగ్య అధికారి (సంబంధిత సంస్థ బయో–సైన్స్ టీచర్)తో పాటు కమిటీ విద్యార్థులకు వడ్డించే ముందు వండిన ఆహారాన్ని సరిగ్గా తనిఖీ చేసి విద్యార్థులకు వడ్డించాలన్నారు. ఆదివారం చికెన్ తీసుకొచ్చి శుభ్రం చేసి వండాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే సమయంలో క్లాస్ 4వ సిబ్బందికి సరిగ్గా హ్యాండ్ వాష్ చేయడం, వంట చేయడానికి ముందు వంటగది పాత్రలను శుభ్రం చేయడం, పరిశుభ్రత స్థితిపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఆర్ఓ నీటినే విద్యార్థులకు ఇవ్వాలన్నారు. దోమలు రాకుండా కిటికీలకు మెష్ బిగించాలని తెలిపారు. హెల్త్ అండ్ శానిటేషన్ అధికారులతోపాటు అన్ని హెడ్ మాస్టర్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ప్రతిరోజూ అన్ని ప్రాంగణాలను తనిఖీ చేయాలని చెప్పారు. డీడీలు, డీటీడీఓలు, ఏటీడీఓలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు నీటి సరఫరా కోసం మిషన్ భగీరథ నీటిని ఇవ్వాలన్నారు.

విద్యాబోధనపై దృష్టి పెట్టాలి

ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు తెలుగు, హిందీ భాషల్లో ప్రాథమిక లెర్నింగ్ మెటీరియల్‌ను సిద్ధం చేసేందుకు ఇటీవల హెడ్ మాస్టర్‌లందరితో కాన్ఫరెన్స్ నిర్వహించామని, సెప్టెంబర్ 20లోగా తప్పకుండా సిద్ధం చేయాలని పీఓ ఆదేశించారు.

ప్రపంచ న్యాయదినోత్సవ శుభాకాంక్షలు
న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, జిల్లా ప్రజలకు
ప్రపంచ న్యాయదినోత్సవ శుభాకాంక్షలు
Ln. బండి అనిల్ కుమార్, అడ్వకేట్
M.A., LLM., (M.Phill)
Ex. Joint Secretary, Warangal Dist. Bar Association
ఇ.నెం. 10-2-208, గోవిందరాజులగుట్ట, గిర్మాజీపేట, వరంగల్, తెలంగాణ రాష్ట్రం. సెల్: 9949038698

ఎంఐఎంతో కేసీఆర్ కుమ్మక్కు


సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హన్మకొండ: రజాకార్ ఖాసీం రజ్వీ వారసులకు చెందిన ఎంఐఎంతో కుమ్మక్కై సెప్టెంబర్ 17ను సమైక్యతా దినోత్సవంగా సీఎం కేసీఆర్ ప్రకటించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు ధ్వజమెత్తారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాల ముగింపు సమావేశం, అంతకు ముందు జరిగిన విలేకరుల సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజల ఆశయాలను, ఆకాంక్షలను పరిగణలోకి తీసుకోకుండానే సమైక్యతా దినోత్సవాన్ని జరుపుతుందని విమర్శించారు. హైదరాబాద్ సంస్థానంలో నిజాం పీడ తొలగకపోవడంతో నాడు సీపీఐ తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిందన్నారు. దీంతో నిజాంకు గత్యంతరం లేకనే అప్పటి కేంద్ర మంత్రి సర్దార్ వల్లబాయి పటేల్ ముందు లొంగిపోయారని, అప్పటికే తెలంగాణలోని భూస్వాములు, దేశ్ ముఖ్‌లు గ్రామాలను వదిలి పట్టణాలకు వలస వెళ్లారని వివరించారు. సీపీఐ ఆధ్వర్యంలో 3వేల గ్రామాలను విముక్తి చేశారని, పది లక్షల ఎకరాల భూమిని పంచారని తెలిపారు. ఆ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని గుర్తు చేశారు. నేడు సాయుధ పోరాటాన్ని పక్కదారి పట్టించేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. బీజేపీ చెబుతున్నట్లుగా అప్పటి ప్రభుత్వం విమోచన చేస్తే ప్రజలపై అకృత్యాలకు పాల్పడిన శత్రు రాజు నిజాంకు రాజ్ ప్రముఖ్ బిరుదు, ఏటా కోటి రూపాయల భరణం ఎందుకు ఇచ్చారని, కాసీం రజ్వీని పాకిస్తాన్‌కు పారిపోయేందుకు అవకాశం ఎందుకిచ్చారని ప్రశ్నించారు. సాయుధ పోరాటాన్ని బీజేపీ నాయకులు హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తున్నారని, ఆ రోజుల్లో బీజేపీయే లేదన్నారు. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన వారిలోనే మఖ్దూం, మొయినుద్దీన్ ఉన్నారని, ఆ పోరాటంలో షేక్ బందగీ, షోయాబుల్లా ఖాన్ లాంటి ఎందరో ముస్లింలు చనిపోయారన్నారు. కేసీఆర్‌కు ప్రజలపై ప్రేమ ఉంటే తెలంగాణ విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం ఒత్తిడికి లొంగొద్దని సూచించారు. హైదరాబాద్‌కు వస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా దీనిని భూస్వాములపై జరిగిన పోరాటమేనని ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, నేదునూరి జ్యోతి, హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, మేకల రవి, తోట మల్లికార్జున రావు, నాయకులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, మోతె లింగారెడ్డి, లక్ష్మణ్, భిక్షపతి, సాంబయ్య పాల్గొన్నారు.

ఇండియా కూటమితో బీజేపీకి భయం

ఇండియా కూటమి ఏర్పాటుతో బీజేపీకి భయం పట్టుకుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ, రాజస్థాన్, మిజోరం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపించక జమిలీ అంశాన్ని బీజేపీ ముందుకు తీసుకొచ్చిందని విమర్శించారు. సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేస్తాయని తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ నిరంకుశ పోకడలు దేశ సంస్కృతికి పనికి రావని స్పష్టం చేశారు.

జ్వరంతో బాలిక మృతి


రిషిత (ఫైల్)

వాజేడు: ములుగు జిల్లా మండల పరిధిలోని పెద్ద గొల్లగూడెం గ్రామానికి చెందిన కొండపర్తి రిషిత(8) జ్వరంతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండపర్తి రాఘవులు కూతురు రిషితకు మూడు రోజుల క్రితం జ్వరం వచ్చింది. మెరుగైన వైద్యం నిమిత్తం భద్రాచలం తీసుకెళ్లి ప్రయివేట్ వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి బాగాలేదని ఖమ్మం తీసుకెళ్లాలని సూచించడంతో ఖమ్మంలో వైద్యం చేయించారు. అక్కడ రక్తకణాల సంఖ్య తగ్గుతోందని వరంగల్ తీసుకెళ్లమని వైద్యులు తెలుపడంతో వరంగల్ తీసుకు వచ్చారు. వరంగల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.

బైక్ దొంగలకు 9 నెలల జైలు

గార్ల: ద్విచక్ర వాహనం చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలకు 9 నెలల జైలు శిక్ష విధిస్తూ మహబూబాబాద్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ మౌనిక శుక్రవారం తీర్పు ఇచ్చారు. 2022 సంవత్సరంలో మానుకోట జిల్లాలోని గార్లకు చెందిన సిరికొండ మహేష్ తన ఇంటి ఎదుట ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గార్ల మండలం రాంపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు చింత యుగంధర్, చింత అశోక్ చోరీ చేశారు. దీంతో మహేష్ గార్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై బానోత్ వెంకన్న కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం మేజిస్ట్రేట్ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

TRAINING

■ అతితక్కువ ఫీజుతో బ్యూటీపార్లర్ & టైలరింగ్ (బోటిక్ వర్క్స్)లో ట్రైనింగ్ ఇవ్వబడును. టైలరింగ్ వర్క్ చేరుటకు యువతులు కావలెను. సుబేదారి. సెల్: 7981536392. [WA-603]

SERVICES

■ శ్రీరామ్ గోల్డ్: మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించలేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ 9133214214. [H-788626]

LOSS OF DOCUMENT

■ Muzafar Mohammed Khan Salman, S/o. Shabbir Ahmed Khan, R/o. H.No. 11-23-1145, L.B. Nagar, Warangal Dist., T.S. have lost the original link Document Vide D.No: 11506/2005 pertaining to my D. No. 2305/2015. While I was shifting house from Nizampura to L.B. Nagar, if anyone found, please inform at the above address and Cont. Numbers: 9959878886, 7097835878. [W-1229424]

DISTRIBUTORS

■ Wanted District Wise Stockists for European Sofa Fabrics, Wallpapers. Call: 9515030644. [QA-5920]

WANTED

■ Wanted MBBS / BAMS/BHMS duty doctors, B.Sc, GNM Nursing Staff X Ray Technicians and Receptionists for a Hospital at Hanamkonda. Cont: 9000282025, 9390672891. [W-1002850]

■ రామకృష్ణ హోం కేర్ సర్వీస్ (డీలక్స్) VJA, HYD. శ్రీమంతుల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్ / నర్సులు కావలెను. భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 94413 84123, 94413 86123. [B-1206744]

■ బాలాజీ హోం కేర్ సర్వీస్ (డీలక్స్) VJA, HYD. శ్రీమంతుల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్/నర్సులు కావలెను భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 94413 81678, 94413 82678 [B-1068108]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్. 3K Ph: 9848571888 [H-189332]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ముగిసిన బియాబానీ దర్గా ఉత్సవాలు

- ఆకట్టుకున్న ఫకీర్ల విన్యాసాలు
- మైమరిపించిన ఖవ్వాలీల బృందం
- పాల్గొన్న వినయ్‌భాస్కర్, బస్వరాజు సారయ్య


పీఠాధిపతి ఖుస్రుపాషాను కలిసిన బీజేపీ నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. అత్యంత భక్తి శ్రద్ధలతో ముస్లిం సంస్కృతి, సంప్రదాయం ప్రకారం మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాలు బధవా ఫకీర్ల విన్యాసాలతో ముగిశాయి. దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా బధవా (ముగింపు) కార్యక్రమాన్ని పురస్కరించుకొని ముస్లిం మత పెద్దలు, భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉత్సవాలు ముగిసినట్లు ప్రకటించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం మత పెద్దలకు పీఠాధిపతి ఖుస్రుపాషా తలపాగా చుట్టి పూల దండలు వేసి సన్మానించి, ఆశీర్వదించారు.


ఫకీర్ల విన్యాసాలు

ఫకీర్ల విన్యాసాలు అదుర్స్

దర్గా ఉత్సవాల బధవాను పురస్కరించుకొని దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా, ఆయన తనయుడు భక్తియార్ బియాబాని ఎదుట హైదరాబాద్, మహారాష్ట్రకు చెందిన సుమారు 100 మంది ఫకీర్లు సాహస కృత్యాలు చేశారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రక్తం చుక్క బయటికి రాకుండా చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఫకీర్లు నాలుకపై, పొట్టలో, మెడ భాగం, కనుగుడ్డు, దవడ, తలలో పదునైన ఇనుప సూదులు, చువ్వలు గుచ్చుకొని, ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు చేసి అందరిని మంత్ర ముగ్ధులను చేశారు. ఖుస్రుపాషా తనయుడు భక్తియార్ బియాబానికి ఫకీర్ల విన్యాసాలలో పాల్గొనడం విశేషం. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, రాజేంద్రప్రసాద్, మహేష్‌లు దర్గాను దర్శించుకొని ఖుస్రుపాషాతో కలిసి ఫకీర్ల విన్యాసాలను తిలకించారు.

మైమరిపించిన ఖవ్వాలి

ఉత్సవాల్లో ముస్లింలు ఖవ్వాలి ప్రదర్శన ఆకట్టుకుంది. ముస్లింల బృందం ఒకరికి మించి మరొకరు పోటీ పడుతూ ప్రదర్శించిన ఖవ్వాలీ ఆకట్టుకుంది. ఖుస్రుపాషా ఖవ్వాలి బృందాన్ని అభినందించారు. ఖుస్రుపాషాతో కలిసి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు ఖవ్వాలి కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఫకీర్ల విన్యాసాలు

ఉలికిపడ్డ దర్గా

- గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురికి గాయాలు
- పరుగులు తీసిన భక్తులు, బాటసారులు
- తప్పిన పెను ప్రమాదం


పేలుడులో ధ్వంసమైన ద్విచక్రవాహనం (ఇన్‌సెట్‌లో) గాయపడిన చిరువ్యాపారి

కాజీపేట రూరల్: కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ముగింపు ఉత్సవాల్లో భక్తులు, దుకాణదారులు, సందర్శకులు బిజీబిజీగా ఉంటుండగా ఒక్కసారిగా రాత్రి 9:10 గంటలకు దర్గా ప్రాంగణం ముందు రైల్వే గేట్ సమీపంలో బాంబు బ్లాస్ట్ లాంటి పెద్ద శబ్దం వినిపించింది. అక్కడ ఉన్న వారు, చుట్టు పక్కల వారు, దుకాణాదారులు పరుగులు తీశారు. శబ్దం వచ్చిన ప్రదేశానికి వెళ్లి చూస్తే అక్కడ నైట్రోజన్ గ్యాస్ సిలిండర్‌తో బెలూన్స్ తయారు చేసి అమ్ముకునే చిరు వ్యాపారికి తీవ్ర గాయాలు అయి ఒక వైపు ఉండగా.. మరోవైపు సిలిండర్ పెట్టిన టూ వీలర్ ధ్వంసం అయింది. గ్యాస్ సిలిండర్ అర కిలోమీటర్ వరకు గాల్లో పైకి లేచి రైల్వే ట్రాక్ వద్ద పడింది. గ్యాస్ సిలిండర్ బ్లాస్ట్‌కు ఇసుక, మట్టి 50 అడుగుల దూరం వరకు పడింది. దర్గా నుంచి రైల్వే గేట్‌లోకి వెళ్లే ముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. దర్గాకు చెందిన రమేష్‌కు కళ్లకు గాయాలు అయ్యాయి. దర్గా ముందు ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో దర్గా లోపల ఉన్న దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా, భక్తియార్ బియాబాని వలంటీర్లు బయటికి వచ్చారు. వలంటీర్లు బబ్బులు, అజీజ్, హసీబ్, గౌస్ తీవ్రగాయాలైన హైదరాబాద్‌కు చెందిన బెలూన్ వ్యాపారిని చేరదీసి అప్పుడే ఘటనాస్థలికి చేరిన కాజీపేట ఎస్సై రవికుమార్, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పేలిన గ్యాస్ సిలిండర్ దర్గా ఉత్సవాల భక్తుల మీదుకు గాని, పక్కన దుకాణాల మీదకు గాని, పైన హైటెన్షన్ విద్యుత్ తీగలకు గాని తాకకుండా జనాలు లేని రైల్వే ట్రాక్ పక్కన పడడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. దర్గాపైన అల్లా దీవెనలు ఉన్నాయని.. ఎలాంటి ప్రమాదం జరగకుండా దేవుడు కాపాడాని ఖుస్రుపాషా అన్నారు.


ఘటన స్థలం వద్ద ప్రజలు

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు


రన్నింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు


సీనియర్ కేటగిరీలో షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్– 14, 16, 18, 20 బాలబాలికలు, మెన్ అండ్ ఉమెన్ కేటగిరీలో 60, 100, 200, 300, 400, 800, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, హ్యామర్‌త్రో, సీనియర్ కేటగిరీలో 5కే, 10కే మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 800 మంది క్రీడాకారులు హాజరైనట్లు వరంగల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ యుగేందర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 30, అక్టోబర్ 01 తేదీల్లో కరీంనగర్‌లో జరగనున్న 9వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని యుగేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథిగా కుడా చైర్మన్ సుందర్‌రాజ్ హాజరై ప్రారంభించారు.

హత్య మిస్టరీని ఛేదించిన పోలీసులు

● నారాయణసింగ్‌ను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్


నిందుతుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కాటారం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం క్రాస్ రోడ్ వద్ద ఇటీవల హత్యకు గురైన నారాయణసింగ్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు శుక్రవారం కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రంజిత్‌రావు వివరాలు వెల్లడించారు. మండలంలోని కొత్తపల్లికి చెందిన నారాయణసింగ్ బయ్యారం క్రాస్ వద్ద మద్యం దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన పసుల మొండయ్య అలియాస్ మొండి సెప్టెంబర్ 10న ఉదయం నుంచి మద్యం సేవించి రాత్రి 11 గంటల సమయంలో బయ్యారం సమీపంలోని నారాయణ సింగ్ దుకాణం వద్దకు వచ్చాడు. ఇద్దరు కలిసి మ ద్యం సేవిస్తుండగా నారాయణ ఒంటిపై ఉన్న చైన్, బ్రాస్‌లైట్, రింగులను మొండయ్య గమనించాడు. ఇంటి పక్కన ఎవరూ లేకపోవడంతో నారాయణసింగ్ మద్యం మత్తులో నిద్రలోకి జారుకోవడంతో బంగారు ఆభరణాలు కాజేయాలని భావించిన మొండయ్య రేకు కత్తితో హత్యకు పాలప్డాడు. విచక్షణా రహితంగా కత్తితో పొడవడంతో నారాయణ సింగ్ మృతి చెందాడు. అనంతరం మృతుడి ఒంటిపై ఉన్న ఆభరణాలను తీసుకొని మొండయ్య బైక్ పై వెళ్తూ.. కత్తి, రక్తపు మరకలు అంటిన చొక్కాను చెట్ల పొదల్లో పడేశాడు. మద్యం మత్తులో కాజేసిన బంగారు ఆభరణాలు ఎక్కడో పడవేసుకున్నట్లు నిందితుడు విచారణలో తెలిపినట్లు పోలీసులు వి వరించారు. హత్యకు వినియోగించిన కత్తి, బైక్, రక్తపు చొక్కాలను స్వాధీనపర్చుకున్నట్లు సీఐ రంజిత్‌రావు తెలిపారు. నిందితుడుని కోర్టులో హాజరు పర్చనున్నట్లు పేర్కొన్నారు. కేసును ఛేదించిన ఎస్సైలు అభినవ్, సురేశ్, ట్రైనీ ఎస్సై ప్రసాద్, కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

మృత్యువుతో పోరాడి ఓడిన అముద

క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

కోదాడ: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

అడుగడుగునా అండగా నిలిచిన 'సాక్షి'

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో 'సాక్షి'కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని 'అయ్యో అముద'శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

మూడు 'రియల్' సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏజెన్సీకి వైద్యాధికారులు

'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'ఏజెన్సీకి ఫీవర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రంతోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహాసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

నర్సాపూర్‌రూరల్: మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు నేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చోబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్ట్రన్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూఫ్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.

అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

సాక్షి, హైదరాబాద్: మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

టీచర్ల భర్తీ తర్వాతే...

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాలవారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించండి

- విభాగాధిపతులకు సోషల్‌సైన్స్ డీన్ లేఖలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సోషల్ సైన్స్‌లోని వివిధ విభాగాల్లో ఇప్పటికే పీహెచ్‌డీలో అడ్మిషన్లు పొందిన అభ్యర్థుల కోసం విభాగాలవారీగా డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించాలని ఆయా విభాగాల అధిపతులకు సోషల్ సైన్స్ డీన్ ఆచార్య టి.మనోహర్ లేఖలను పంపారు. వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ సీటు వచ్చిన అభ్యర్థులు యూనివర్సిటీలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో జాయిన్ అయ్యారు. ఈనెల 6వ తేదీతో ఈప్రక్రియ ముగిసింది. డిపార్టుమెంట్ రీసెర్చ్ కమిటీ (డీఆర్‌సీ) సమావేశాలను నిర్వహించి ఆయా అభ్యర్థులకు సూపర్‌వైజర్లను కేటాయించి, వారి రీసెర్చ్ టాపిక్ ఫైనల్ చేస్తారు. ఈ డీఆర్‌సీ కమిటీలో సోషల్‌సైన్స్ డీన్‌తోపాటు విభాగాల అధిపతులు బీఓఎస్‌లు, రీసెర్చ్ సూపర్‌వైజర్లు ఉంటారు. ఈ ప్రక్రియ పూర్తయితేనే పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినట్లు. సోషల్ సైన్స్ పరిధిలోని విభాగాల అధిపతులు త్వరగా పూర్తిచేయాలని సోషల్‌సైన్స్ డీన్ ఆచార్య టి.మనోహర్ విభాగాల అధిపతులకు లేఖలను పంపినట్లు వెల్లడించారు.

శ్వేతార్క ఆలయంలో పెద్దపట్నం


ఆలయంలో వేసిన పెద్దపట్నం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఒగ్గు కళాకారులు శుక్రవారం పెద్దపట్నం వేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి దేవస్థాన ఒగ్గు పూజారి సింగారపు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఒగ్గు కళాకారులు రంగు రంగులతో శ్వేతార్కుడి ఎదుట పెద్దపట్నం వేశారు. పూజలో బ్రహ్మశ్రీ త్రిగుళ్ల శ్రీనివాస్ శర్మ, అయినవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి, తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ శోభాయాత్ర

- ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహణ
- పెద్ద ఎత్తున పాల్గొన్న వ్యాపారులు, నగర ప్రముఖులు
- గ్రెయిన్ మార్కెట్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు భారీ ర్యాలీ


వరంగల్ మార్కెట్ నుంచి ప్రారంభమైన చాంబర్ వజ్రోత్సవ శోభాయాత్ర

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 సంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని శ్రీలక్ష్మీ గణపతి సహిత అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కాశిబుగ్గ చౌరస్తా, పోచమ్మ మైదాన్, మండిబజార్, జేపీఎన్ రోడ్, వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, రైల్వేస్టేషన్ల మీదుగా వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయం వరకు కొనసాగింది. సుమారు 3,000 మంది వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, గుమస్తా, దడువాయి, హమాలీ, మహిళా కూలీలు, మార్కెట్లోని అన్ని వర్గాల ప్రజలు శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 1948లో వర్తక సంఘం పేరుతో తొలి అడుగు వేసి వ్యాపారుల ఐక్యత, వ్యాపార నైతికత, సమాజ సేవ ధ్యేయాలతో వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీగా రూపాంతరం చెందిందన్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అస్తిత్వాన్ని కాపాడుకుంటూ 75 సంవత్సరాలు పూర్తి చేసుకొని వజ్రోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భాన్ని వరంగల్ నగర ప్రజలతో మమేకమై సంతోషాన్ని పంచుకోవాలనే లక్ష్యంతో శోభాయాత్ర నిర్వహించామన్నారు. 30వ తేదీన వజ్రోత్సవాల ప్రారంభం, అక్టోబర్ 1న ముగింపు వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ, నగర ప్రజలను కోరారు. ఈ యాత్రను ఛాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీతోపాటు మాజీ అధ్యక్షులు టి.రమేశ్‌బాబు, కె.కుమారస్వామి, కె.పెంటయ్య, డి.కుమారస్వామి, జెడీఎం ఇ.మల్లేశం, వరంగల్, మామునూరు ఏసీపీలు బి.కిషన్, వి.సతీష్‌బాబు, మార్కెట్ సెలక్షన్–గ్రేడ్–సెక్రటరీ బీవీ.రాహుల్‌లు జెండా ఊపి ప్రారంభించారు.

కేయూ హాస్టళ్ల నిర్వహణపై నివేదిక

- వీసీ, రిజిస్ట్రార్లకు అందజేసిన కమిటీ
- ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు వసతి కల్పించాలని సూచన



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని హాస్టళ్ల నిర్వహణతోపాటు పలు అంశాలపై అధ్యయనం చేసిన ఆచార్య టి.మనోహర్‌తోకూడిన కమిటీ నివేదికను వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావుకు మూడు రోజుల క్రితం అందజేసింది. యూనివర్సిటీ హాస్టళ్లలోని నిర్వహణ సమస్యలు, నాన్‌బోర్డర్ల సమస్య అరికట్టడం, అధికంగా మెస్‌బిల్లులు రావడాన్ని ఎలా తగ్గించగలగాలి.. యూనివర్సిటీలో ఉన్న హాస్టళ్ల ప్రకారం ఎంతమందికి హాస్టల్ వసతి కల్పించవచ్చు తదితర అంశాలతోకూడిన నివేదిక ఇవ్వాలని ఈఏడాది ఆగస్టు 2న వీసీ అప్రూవల్ మేరకు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు కమిటీని నియమించారు. హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు మనోహర్ చైర్మన్‌గా.. మొత్తం 12మందితో కూడిన కమిటీని నియమించారు. ఈ కమిటీ హాస్టళ్లు, మెస్‌లను పరిశీలించింది. నాన్‌బోర్డర్లు కొందరు ఎలక్ట్రిక్ కుక్కర్లతో వంట చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు గత ఏడాది హాస్టల్‌వసతి ఇవ్వకపోవడంతో ఈ సమస్య ఎక్కువైనట్లు కూడా గుర్తించారు. ఏఏ హాస్టళ్ల పరిధిలో మెస్‌బిల్లులు ఎక్కువగా వస్తున్నాయో.. ఎందుకు వస్తున్నాయో.. గుర్తించినట్లు సమాచారం. మెస్‌బిల్లులను తగ్గించేందుకు కమిటీ సూచనలు చేసినట్లు తెలిసింది. ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్‌వసతి కల్పిస్తే నాన్‌బోర్డర్ల సమస్య తగ్గే అవకాశం ఉంటుందని భావించినట్లు సమాచారం. హాస్టల్ వసతికల్పనలో అనాథలు, దివ్యాంగులు, దూర ప్రాంత విద్యార్థులకు తొలుత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారని తెలిసింది. మహిళా హాస్టళ్లలో మహిళల కోసం తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు చేసినట్లు తెలిసింది. హాస్టళ్ల నిర్వహణలో ప్రధానంగా వివిధ బిల్లుల చెల్లింపుల్లో సరిగా లేనట్లుగా కమిటీ గుర్తించింది. నిబంధలన ప్రకారం.. హాస్టళ్ల డైరెక్టర్ వివిధ బిల్లులు చెల్లించాల్సిండగా సూపరింటెండెంట్ కొన్నిబిల్లులు చెల్లించినట్లుగా కమిటీ దృష్టికి వచ్చింది. కానీ.. కమిటీ నిధుల దుర్వినియోగంపై దృష్టిసారించలేదు.

విచారణ కమిటీ వేస్తారా?

నిధుల వినియోగంపై ఆర్థిక నిపుణులతో లోతుగా పరిశీలనకు యూనవర్సిటీ అధికారులు విచారణ కమిటీని వేస్తారా.. లేదా.. అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. హాస్టళ్ల నిర్వహణ బిల్లుల చెల్లింపులో నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈక్రమంలోనే హాస్టల్స్ ఆఫీస్ సూపరింటెండెంట్ అక్కడినుంచి బదిలీ చేయించుకుని ఈనెల 14న సుబేదారిలోని మహిళా పీజీ కళాశాలకు వెళ్లడం గమనార్హం.

విలీనానికి ముందు సమస్యలు పరిష్కరించాలి


వరంగల్–1 డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

హన్మకొండ: విలీనానికి ముందు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు సి.హెచ్.రాంచందర్, ఆర్టీసీ జేఏసీ వరంగల్ రీజియన్ నాయకుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హనుమకొండలోని వరంగల్–1. వరంగల్–2, హనుమకొండ డిపోల వద్ద ఆర్టీసీ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం బిల్లుకు ఆమోద ముద్ర వేసిన గవర్నర్ తమిళి సైకి కృతజ్ఞతలు తెలిపారు. విలీన ప్రక్రియకు ముందు కార్మికులకు రావాల్సిన 2017, 2021లో జరగాల్సిన రెండు పీఆర్‌సీలు అమలు చేయాలని, కార్మికులకు రావాల్సిన ఎరియర్స్ చెల్లించాలని, సీసీఎస్‌కు చెల్లించాల్సిన డబ్బులు వడ్డీతో సహా చెల్లించాలని, కొత్త బస్సులు కొనాలని, అద్దె బస్సుల నిర్ణయాన్ని విరమించుకోవాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు ఉన్న బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు టి.ఎల్లయ్య, మహేందర్, పాషా, ప్రభాకర్, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


రైతులకు ట్రైకోడెర్మాను అందజేస్తున్న డాక్టర్ రాజన్న

కరీమాబాద్/సంగెం: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామునూరు కేవీకే ప్రిన్సిపాల్ డాక్టర్ రాజన్న అన్నారు. పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని గవిచర్ల రైతులకు శుక్రవారం ట్రైకోడెర్మా మందు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజన్న మాట్లాడుతూ.. వివిధ పంటల్లో ఆశించే చీడపీడల తోపాటు ఎండు తెగులు, వేరు కుళ్లు తెగులు నివారణకు ట్రైకోడెర్మా బాగాపనిచేస్తుందని తెలిపారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు మాట్లాడుతూ.. పంటల్లో ఎండు తెగులు నివారణ కోసం లీటరు నీటిలో 3 గ్రాముల ట్రైకోడెర్మా కలిపి మొక్క వేరు తడిసే విధంగా పోయాలని సూచించారు. ప్రతీ సంవత్సరం ఎండు తెగులు ఆశిస్తున్నట్లయితే పంట మార్పిడి చేయడమే కాకుండా పశువుల ఎరువులో ట్రైకోడెర్మాను కలిపి దుక్కిలో వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ శశాంక్, రైతు సమన్వయకర్తలు సురేష్, భిక్షపతి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలి

- రామగుండం సీపీ రాజేశ్వరి


సమావేశంలో పాల్గొన్న మూడు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు

భూపాలపల్లి: రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాల్సిన అవసరం ఉందని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జెన్‌కో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ పుల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. మావోయిస్టుల కదలికలు, ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. మావోయిస్టుల కదలికల సమాచారాన్ని పరస్పరం చేరవేర్చుకోవాలని నిర్ణయించారు. ఫలితంగా మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరమవుతుందని ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించవచ్చని పేర్కొన్నారు. త్వరలో తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల దృష్ట్యా రాష్ట్రాల సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేయటంతోపాటు, మద్యం, డబ్బు సంబంధించి అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మూడు రాష్ట్రాల పోలీసులు పరస్పరం సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకొంటూ సాఫీగా ఎన్నికలు సాగేలా చూడాలని తెలిపారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలతో సరిహద్దులో ఉన్న సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్‌బీడబ్ల్యూ వారెంట్స్ విషయంలో మూడు రాష్ట్రాల పోలీసులు సహకరించుకోవాలలని సూచించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ములుగు ఎస్పీ గౌస్ ఆలం, కొమురం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, మంచిర్యాల ఎస్పీ సుధీర్, ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్, బీజాపూర్ జిల్లా ఐపీఎస్ పోలీసు ఉన్నతాధికారులు, గడ్చిరోలి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, హుజూరాబాద్ ఏసీపీ జీవన్ రెడ్డి, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు రాములు, రామ్మోహన్ రెడ్డి, మూడు రాష్ట్రాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

విద్యార్థుల శక్తిని గుర్తించి పదును పెట్టాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- గూడూరులో సైన్స్ ఫెయిర్ పరిశీలన


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: ఉపాధ్యాయులు.. విద్యార్థుల్లో దాగి ఉండే అంతర్లీన శక్తులను గుర్తించి, ఆయా రంగాల్లో రాణించేలా గైడ్ చేసేందుకు సైన్స్‌ఫెయిర్‌లు ఉపయోగపడతాయని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని గూడూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో మాట్లాడారు. వారి ప్రయోగాత్మక ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి తరగతి గదుల్లోనే రేపటి భారత భవిత రూపుదిద్దుకుంటుందని, అందుకు ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉండాలని సూచించారు. విద్యార్థులను వివిధ రంగాలపై ఆసక్తి కనబరిచేలా తీర్చిదిద్దాలని కోరారు. సైన్స్ ఫేర్‌లో ఉత్తమ ప్రయోగాలను ప్రదర్శించిన విద్యార్థులను మంత్రి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కురి శ్రీనివాస్‌రావు, సర్పంచ్ మంద కొమురయ్య, ఎంపీటీసీ చెరిపెల్లి రాజేశ్వరి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.